క్లుప్తంగా

వేడుకగా ధ్వజస్తంభం ప్రతిష్ట


విశేషాలంకరణలో వెంకటరమణ స్వామి

బి.కొత్తకోట: మండలంలోని గట్టులో వెలసిన పురాతన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న ఈ ఆలయ ఉత్సవాలు ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రెండోరోజు ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలు, మూలమంత్ర హోమాలు, ప్రాకారబలిః, మహామంగళ హారతి, పూర్ణాహుతి కార్యక్రమాల నిర్వహణ అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట వేడుకగా జరిగాయి. సాయంత్రం కుంభాభిషేక కలశ ఆరాధన, మూలమూర్తి జప హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో వెంకటరమణస్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అన్నదానం నిర్వహించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఆలూరి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ సుధాకర్‌బాబు, మాజీ ఎంపీటీసీ, చెరువు సంఘం అధ్యక్షురాలు శెట్టి నాగలాంబిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలు పరిశీలించిన ఆర్‌జేడీ


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ శ్రీనివాసులు

పీలేరు : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలను కడప ఆర్‌జేడీ శ్రీనివాసులు పరిశీలించారు. బుధవారం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో పరీక్షా కంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో సదుపాయాలు, విద్యార్థులకు అందించాల్సిన మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సజావుగా నిర్వహణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు పరీక్షల నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించి నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్లు వై. వెంకటరెడ్డి, బి. రెడ్డెప్ప, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు నాగసురేష్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యుడు భాస్కర్, డిపార్ట్‌మెంటల్ అధికారులు వెంకటరమణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల


కేవీపల్లె : ఏపీ గురుకుల పాఠశాలు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష రాసిన వారి అప్లికేషన్ ఐడీ నంబరు, పుట్టిన తేదీని ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఫలితాలు తెలుసుకోవచ్చునని తెలిపారు.

పాలిసెట్ ఫలితాల్లో సత్తా


భోజనపు కార్తీక్

మదనపల్లె సిటీ: పాలిసెట్–2025 ప్రవేశపరీక్ష ఫలితాల్లో మదనపల్లె పట్టణం రాంరెడ్డి లేవుట్‌కు చెందిన భోజనపు కార్తీక్ జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. బుధవారం పాలిసెట్ ఫలితాలు ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో 188వ ర్యాంకు దక్కించుకున్నాడు. తల్లిదండ్రులు వెంకటసుబ్బయ్య, శైలజ. వీరు చేనేత కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. కార్తీక్ స్థానిక వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (రాంరెడ్డి లేవుట్)లో పదో తరగతి వరకు చదివాడు. పదో తరగతిలో 582 మార్కులు సాధించాడు. పాఠశాలలో మొదటి నుంచి చురుగ్గా పాల్గొంటూ ప్రతిభను కనబరిచేవాడు. పాలిసెట్‌లో మ్యాథ్స్‌లో49, ఫిజిక్స్ 38, కెమిస్ట్రీ 30 మార్కులు వచ్చాయి. ఇంజనీరింగ్ చేసి విదేశాల్లో ఉద్యోగం చేయాలన్నదే తన ధ్యేయమని కార్తీక్ తెలిపాడు. కార్తీక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

వీరజవాన్‌కు కొవ్వొత్తుల నివాళి


అమర జవానుకు నివాళులర్పిస్తున్న నాయకులు

బి.కొత్తకోట: ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్‌కు బుధవారం రాత్రి బి.కొత్తకోటలో కొవ్వొత్తుల నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్, టీడీపీ, బీజేపీ నాయకులు మురళీ నాయక్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు చేతపట్టి నినాదాలు చేశారు. మీ త్యాగం వృథా కాదు.. మురళీ నాయక్ అమర్ రహే అంటూ నినదించారు.

చెరువంత నిర్లక్ష్యం..!

- చిట్టడవిని తలపిస్తున్న చెరువులు
- చెట్ల తొలగిస్తే అందరికి ఎంతో మేలు
- మరమ్మతులు చేస్తే తీరునున్న తాగు నీటి సమస్య
- ఆందోళనలో అన్నదాత


కొత్తపల్లె చెరువులో పెరిగిన ముళ్ల కంపలు

గుర్రంకొండ: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు కంపచెట్లతో నిండిపోయాయి. చెరువుల నిర్వహణ గాలికి వదిలేయడంతో ఈ దుస్థితికి చేరుకున్నాయి. చెరువులో.. చెరువు కట్ట పై... చెరువు కాలువల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు భారీగా పెరిగాయి. పూడిక తీయకపోవడంతో కాలువలు పూడిపోయే దశలో ఉన్నాయి. చెరువు కట్టలకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రస్తుతం నీరొస్తే... గండ్లు పడటం.. తెగిపోయే ప్రమాదముందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో ముళ్ల పొదలు, పూడిక పేరుకుపోవడంతో వర్షపునీరు చెరువు చేరే అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకంలో చెరువులకు మరమ్మతులు చేశారు. ప్రస్తుతం చెరువుల్లో చెట్లను తొలగించేందుకు ఏ పథకం లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

కంపచెట్లతో నిండిపోయిన చెరువులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 986 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో 38 మేజర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం చెరువుల్లో పెద్ద ఎత్తున కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఇక్కడ చెరువు ఉన్న ఆనవాళ్లే కనిపించడం లేదు. చివరకు చెరువు కట్టల మీద కూడా కంపచెట్లు పెరిగిపోవడంతో కట్టల పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. వీటితోపాటు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరిగిపోయాయి. ఎండిపోయిన ముళ్లకంపలు చెరువుల్లో ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా పడిఉన్నాయి.

ఉపాధిహామీలో అవకాశం ఏది?

చెరువుల్లో ముళ్లపొదలు, కంపచెట్ల సమస్య పరిష్కారం కోసం ఉపాధిహామీ పథకం వైపు ఆయకట్టు రైతులు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకంలో చెరువుల్లో ముళ్ల కంపల తొలగింపు పనులు ముమ్మరంగా జరిగాయి. ఆరేళ్ల క్రితం ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెరువుల్లో ముళ్లకంపలు, కంపచెట్లను తొలగించే పనులు చేశారు. అప్పట్లో పెద్ద ఎత్తున అన్ని చెరువుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద చెరువుల్లో ఫారంపాండ్లు చెరువుకట్ట మీద కంపచెట్లు తొలగించే పనులు చేపడతున్నారు. దీంతో చెరువుల్లో ఎక్కడైతే ఫారంపాండ్లు తవ్వుతారో అక్కడ మాత్రమే కంపచెట్లు తొలగిస్తున్నారు. దీంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని గ్రామస్తులు అంటున్నారు. ఉపాధిహామీ పథకం కింద పూర్తి స్థాయిలో కంపచెట్లు, ముళ్ల పొదలు తొలగించే పనులు చేపడితేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

కంపచెట్లు తొలగించాలి



చెరువులు, కుంటల్లో అల్లుకుపోయిన కంపచెట్లను, ముళ్ల పొదలను తొలగించాలి. కంపచెట్లు తొలగిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. పశువులు, మేకలు, గొర్రెలకు తాగునీటి వసతి కల్పించవచ్చు. ఆరేళ్ల కిందట ఒకసారి కంపచెట్లను తొలగించారు. మళ్లీ ఇలాంటి పనులను అధికారులు చేపడితే బాగుంటుంది. – శ్రీరాములు, క్రిష్టాపురం

ఉపాధిహామీలో అవకాశం లేదు



చెరువుల్లో కంపచెట్లు, ముళ్లపొదలు తొలగించే అవకాశం ఉపాధి హామీ పథకంలో లేదు. కేవలం చెరువు కట్టమీద కంపచెట్లు తొలగించడం, చెరువుల్లో ఫారంపాండ్లు తవ్వేప్రదేశంలో మాత్రమే కంపచెట్లు తొలగించేందుకు ప్రస్తుతం అవకాశముంది. చెరువుల్లో పూర్తి స్థాయిలో కంపచెట్లు తొలగించేందుకు ఏ పథకాలు లేవు. – జయరామిరెడ్డి, ఏపీవో, గుర్రంకొండ

సిద్దారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


సిద్దారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరరెడ్డి

తంబళ్లపల్లె: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సిద్దారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లపల్లె పంచాయతీ దిగువపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సిద్దారెడ్డి (80) సోమవారం జారిపడి తలకు బలమైన గాయం కావడంతో తిరుపతి రూయా ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బుధవారం సిద్దారెడ్డి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సిద్దారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ఓదార్చి, అండగా ఉంటానని భరోసా కల్పించారు. సర్పంచు మౌలాలి, పార్టీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, వైఎస్ ఎంపీపీ కరీమ్, రమేష్‌రెడ్డి, ఎరుకల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, రామ్మూర్తి, శివారెడ్డి పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం


మరుగుదొడ్లను ప్రారంభించిన కమిషనర్

బి.కొత్తకోట: దశాబ్దాలుగా బి.కొత్తకోట పట్టణంలో మరుగుదొడ్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులకు బుధవారం నగర పంచాయతీ అధికారులు పరిష్కారం చూపించారు. వివిధ ప్రాంతాల నుంచి బి.కొత్తకోటకు రాకపోకలు సాగించే వందలాది మంది ప్రజలకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. దీనిపై వినతులు రావడంతో కమిషనర్ జీవీ పల్లవి, ఉద్యోగులు రమాదేవి, సిబ్బంది జ్యోతిచౌక్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయగా బుధవారం కమిషనర్ వీటి ప్రారంభించారు. ఇందులో పిల్లలు, మహిళలు, వృద్ధులు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను నిర్మించారు. చిన్నపిల్లల తల్లులకు పాలు పట్టించేందుకు వేరుగా ఓ గదిని నిర్మించి అందులో సౌకర్యాలను కల్పించారు. ఏఈ రాజేంద్ర, రమాదేవి, సీపీఐ నాయకులు మనోహర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కుడుం శ్రీనివాసులు, గంజి మోహన్, లోకనాథరరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి


గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, నిసార్ అహ్మద్

రామసముద్రం: రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ కొండూరు గ్రామానికి చెందిన మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కొండూరు కృష్టారెడ్డి గృహప్రవేశానికి బుధవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మదనపల్లె నియోజకవర్గం సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. గృహప్రవేశ కార్యక్రమం సందర్భంగా వచ్చని నాయకులను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆత్మీయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి , రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ గెవన్న, భాస్కర్‌గౌడు, సుబ్బారెడ్డి, నందకిషోర్‌రెడ్డి, ఇమ్రాన్, బాబు, తిప్పన్న, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, విశ్వనాథరెడ్డి , తిమ్మయ్య పాల్గొన్నారు.

పీలేరు : పీలేరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు స్టాంపుల నరసింహారెడ్డి కుమారుడు డాక్టర్ ధర్మేష్‌రెడ్డి వివాహం గురువారం రాయచోటిలో జరగనుంది. ఈ క్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం నరసింహారెడ్డి ఇంటికి వచ్చి నూతన వరుడిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండు జగన్‌మోహన్‌రెడ్డి, విజయ్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా వద్దు - కుటుంబమే ముద్దు



అనిబిసెంట్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్

మదనపల్లె రూరల్ : నవోదయం–2.0 కార్యక్రమంలో భాగంగా అన్నమయ్యజిల్లాను సారా రహిత జిల్లాగా తయారుచేసేందుకు నాటుసారా వద్దు– కుటుంబమే ముద్దు అంటూ హోర్డింగ్‌లు ఏర్పాటుచేసి, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. బుధవారం పట్టణంలోని కదిరిరోడ్డు, అనిబిసెంట్ సర్కిల్‌లో నాటుసారా నిర్మూలనలో భాగంగా అవగాహన కల్పించేందుకు హోర్డింగ్ ఏర్పాటు చేశారు. సీఐ భీమలింగ మాట్లాడుతూ నవోదయం–2.0 కార్యక్రమం ద్వారా సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతుంటే 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదుచేయాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


పీలేరు రూరల్ : డీఎల్‌పీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మిక యూనియన్ నాయకులు


మదనపల్లె రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ల పత్రాన్ని చూపుతున్న సిబ్బంది

పీలేరు రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు వెంకటరామయ్య కోరారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మదనపల్లె డీఎల్‌పీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు హైకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. తమ సమస్యపై గతంలోనూ జిల్లా కలెక్టర్‌కు, డీపీవోకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలని కోరారు. రూరల్ మండలంలో పీఎఫ్, ఈఎస్ఐ, బ్యాంకు ద్వారా జీతాలు ఇస్తామని రెండు ఏళ్లు గడచినా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, యూనియన్ నాయకులు బి.వి. రమణ, ఓబులేసు, నాగార్జున పాల్గొన్నారు.

మదనపల్లె రూరల్: తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) కెప్టెన్లు, డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో విలేకర్లతో మాట్లాడుతూ తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభించినప్పటి నుంచి కేవలం రూ.8,800 వేతనం మాత్రమే యాజమాన్యం ఇస్తోందన్నారు. అంతే కాకుండా సీటీసీ పేరుతో యాజమాన్యం చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ వాటాలను కూడా ఉద్యోగుల జీతాల నుంచి మినహాయిస్తోందన్నారు. సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో మరింతగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే మే 20న రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఎ.వి.నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య తగ్గడంపై ఏపీడీ అసంతృప్తి

పెద్దతిప్పసముద్రం: ఉపాధి హామీ క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి బుధవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో ఉపాధి హామీ కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంపై కారణాలను అడిగి తెలుసుకోవాలని డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఏపీడీ మండలంలోని రంగసముద్రం, రాపూరివాండ్లపల్లి, పీటీఎం తదితర పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 1,350 మంది మాత్రమే కూలి పనులు చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలకు పనులు కల్పించడంలో ఉపాధి సిబ్బంది విఫలమయ్యారని ఆయన అసహనం వ్యక్తం చేసారు. అంతేగాక ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో కూడా సిబ్బంది తీవ్ర అలసత్వం వహిస్తున్నారని మండి పడ్డారు. ఉపాధి హామీ పనులపై ప్రజల్లో అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి హితబోధ చేశారు. అనంతరం ఆయన పలు చోట్ల ఉపాధి హామీ కూలీలు, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. బిల్లులు సకాలంలో అందుతున్నాయా.. పనులు జరిగే ప్రదేశంలో మౌలిక వసతులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెస్తాం

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి


నాయకులను సన్మానిస్తున్న నిసార్ అహ్మద్, నరేష్‌కుమార్

రామసముద్రం: వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తామని మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోవు ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపడుతారని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం రామసముద్రం మండలంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఇటీవల పార్టీ నూతన కమిటీ సభ్యులకు వివిధ రకాల పదవులు పొందిన వారికి అభినందన , సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు కేక్ కట్ చేసి పదవులు పొందిన నాయకులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్, నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రామసముద్రం మండలం వైఎస్సార్‌సీపీ కంచుకోటగా ఉందన్నారు. కార్యకర్తలను పలు రకాలుగా ఇబ్బందులు పెడుతున్న ధైర్యంగా ఉన్న ప్రతి ఒక్కరికి కార్యకర్తలకు దన్యవాదాలు తెలిపారు. రామసముద్రం మండలంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని , రాబోయే ఎన్నికలో మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ పార్టీ జెండా ఎగురవేయాలని నిసార్ అహ్మద్ పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ గెవన్న, కన్వీనర్ కేశవరెడ్డి, ఎంపీపీ కుసుమకుమారి, భాస్కర్‌గౌడు, కృష్టారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, కృష్ణప్ప, ప్రకాష్, సుబ్బారెడ్డి, రెడ్డివీరేగౌడు, సుజ్ఞానమూర్తి, శివ, అంబరీష్, దొడ్డిపల్లి ఆనంద, విజయ్‌రాజు, జీకే చంద్ర, విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి


గుర్రంకొండలో ఆర్టీసీ బస్టాండు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గుర్రంకొండ: మండలంలో జరుగుతున్న రీసర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని రాయచోటి ఆర్డీవో ఎ.శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన తనిఖీలు నిర్వహించారు. కార్యాలయానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ సమస్యలపై ఆరా తీసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే కార్యక్రమం ఎటువంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలన్నారు. నిర్ణీత గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ అర్జీలను పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. వివాదాస్పద అర్జీలు, సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ఇందిరమ్మ కాలనీ, ఆర్టీసీ బస్టాండు స్థలాలను పరిశీలించారు. చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలో గతంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు, హైస్కూలు, ఆర్టీసీ బస్టాండు నిర్మాణాలకు కేటాయించిన స్థలాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఇందిరమ్మకాలనీ, జగనన్న లేఅవుట్లలో ఖాళీ స్థలాలను గుర్తించి, ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియా నిర్మూలన అందరి బాధ్యత


మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కేవీపల్లె : సికిల్‌సెల్ అనీమియా నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లేళ్లమంద, గర్నిమిట్ట పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రేష్మ అన్నారు. బుధవారం గర్నిమిట్ట పీహెచ్‌సీలో బ్లాక్ స్థాయి సికిల్‌సెల్ ఏనీమియా వ్యాధి నిర్మూలన సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికిల్ సెల్ ఏనీమియా వ్యాధి వారసత్వంగా వచ్చే ఎర్రరక్త కణాల రుగ్మతని తెలిపారు. ఈ వ్యాధి గ్రస్తుల్లో తీవ్రమైన రక్తహీనత ఏర్పడుతుందన్నారు. వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం 40 సంవత్సరాల లోపు గిరిజనులందరికీ ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేయిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి హైడ్రాక్సి యూరియా మాత్రలతోపాటు ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంఈవో రెడ్డిబాషా, డాక్టర్ అర్చన, ఆరోగ్య సిబ్బంది భాగ్యలక్ష్మి, రమాదేవి, పురుషోత్తం, రుక్మిణి, అన్నపూర్ణ, వెంకటసాయి వరప్రసాద్, కోర్ సంస్థ శైలజ పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి చక్రస్నానం


స్వామివారికి చక్రస్నానం చేస్తున్న పండితులు

మదనపల్లె సిటీ: శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం బుధవారం కనుల పండువగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ముందు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీవారి సుదర్శన చక్రానికి భృగుతీర్థంలో ముంచి స్నానం చేయించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో భృగుతీర్థం (కోనేరు)లో పుణ్యస్నానాలు ఆచరించారు. చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు నిర్వహించిన వారికి, సహరించిన వారికి, ఉత్సవాల్లో శ్రీవారిని దర్శించుకున్న వారికి ఇలా అందరికి ఉత్సవ యజ్ఞ ఫలం లభిస్తుందని అర్చకులు తెలిపారు. సాయంత్రం హోమం, మహాపూర్ణాహుతి, ప్రాకారోత్సవం నిర్వహించారు. కోటవీధి, సిపాయివీధి ఉభయదారులగా స్వామి అశ్వవాహనంపై విహరించారు. అలాగే శ్రీవారి చక్రస్నానం తర్వాత బ్రహ్మోత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తూ ఎగురవేసిన గరుడ పతాకాన్ని అవరోహనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర, ఆలయ సిబ్బంది అంకన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాచండీ హోమం


మహా చండీహోమంలో పాల్గొన్న భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన సంతాన ప్రదాయిని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి పునః ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా మహాచండీ హోమం వైభవంగా నిర్వహించారు. ఇటీవల అమ్మవారి ఆలయాన్ని రూ. 2.50 కోట్లతో పునఃనిర్మించారు. ఇందులోభాగంగా అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్టించే కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రెండవ రోజైన బుధవారం అమ్మవారి ఆలయంలో మహాచండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే దేవతా ఉత్థాపనం, పంచామృతాన్నం, హోమం, యంత్ర ప్రతిష్ట, వాస్తుహోమం, మహాచండీహోమాలు వైభవంగా నిర్వహించారు. సాయంకాలం ప్రదోషపూజ, మహాస్నపనము, పుష్పాదివాసము, శయ్యాదివాసము, ఆదివాస హోమం, మహానైవేద్యం, మహామంగళహారతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిష్ట కార్యక్రమ దాతలు బొమ్మిశెట్టి రెడ్డి పరంజ్యోతి, మోడెం వీరాంజినేయ ప్రసాద్, సర్పంచ్ ప్రేమకుమారి, ఎంపీటీసీ ప్రసాద్‌నాయుడు, ఆలయ ఈఓ మంజుల, సిబ్బంది బాలకృష్ణ, మహేష్, వెంకటరమణ, ప్రసాద్ భక్తులు, పాల్గొన్నారు.

లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణప్ప


మాట్లాడుతున్న తోపు కృష్ణప్ప

మదనపల్లె రూరల్ : కార్మికుల మెడకు ఉరితాళ్ల మాదిరిగా నిలిచిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రజానీకం పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె విజయవంతంపై కార్మిక సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి లేని వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు ప్రభుత్వం భూమిని అందించాలన్నారు. ప్రాథమిక అవసరంగా, అన్ని గ్రామీణ కుటుంబాలకు గృహాలు అందించాలని. బలవంతపు భూ సేకరణను నిలిపివేయాలని కోరారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విడిపించి గ్రామీణ వ్యవసాయ కూలీలకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీన పర్చడం,అమ్మడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 35వేలు అమలు చేయాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ,, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్‌ను తదితర స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్,ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, అధ్యక్షుడు రెడ్డప్ప, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు దేవా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలు,ఆటో వర్కర్స్ మస్తాన్,కరీముల్లా, మున్సిపల్ వర్కర్స్ వంశీ, శంకర్ ప్రసాద్, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.